క్లుప్తంగా

భీమవరంలో పొలంబడి



భీమవరంలో నిర్వహించిన పొలం బడి కార్యక్రమం దృశ్యం

భీమవరం: సార్వా వరిపైరుపై చీడపీడలు ఆశించకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని భీమవరం మండల వ్యవసాయశాఖాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం భీమవరంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన రైతులకు సార్వా సీజన్‌లో వరి పైరుపై తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. పైరు ప్రస్తుతం ఈనిక, పొట్టదశలో ఉన్నందున అధికమొత్తంలో ఎరువులు వాడకూడదని అలాగే అనవసరంగా పురుగుమందులు పిచికారి చేయడం వల్ల అదనపు పెట్టుబడి తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు తమ సందేహాలని ఏఓను అడిగి నివృత్తి చేసుకున్నారు.

బాలాత్రిపుర సుందరి అమ్మవారికి సువర్ణ కంఠాభరణం సమర్పణ



అమ్మవారికి సమర్పించిన సువర్ణ కంఠాభరణం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మెంటేవారి తోటలో విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరి అమ్మవారికి భక్తులు సువర్ణ కంఠాభరణం అందజేశారు. పట్టణానికి చెందిన చవ్వకుల హేమ చంద్ర మూర్తి, నాగమణి దంపతులు, శివ రామకృష్ణ కుటుంబ సభ్యులు సువర్ణ కంఠాభరణం ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఆలయ అర్చకులు బాలాత్రిపుర సుందరి అమ్మవారికి పూజలు చేసి సువర్ణ కంఠాభరణం అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పారిశుద్ధ్య సమస్యలపై అప్రమత్తత అవసరం

నరసాపురం: వర్షాల కారణంగా పట్టణంలో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కమిషనర్ వైఎస్సార్ కాలనీ, ఆదర్శకాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. ప్రతిరోజూ డ్రెయినేజీలను బాగు చేయాలని చెప్పారు. దగ్గరుండి డ్రెయినేజీలను శుభ్రం చేయించారు.

వరల్డ్ ఫుడ్ డే శుభాకాంక్షలతో (అక్టోబర్-16)
రుచికరమైన టిఫిన్ మా ప్రత్యేకత
హోటల్ మౌర్య
ప్రొ॥ అబ్దుల్ కలామ్
కొత్త బస్టాండ్ ఎదుట, భీమవరం -1
సెల్ : 90000 16669, 98854 14443

వరల్డ్ ఫుడ్ డే శుభాకాంక్షలు
న్యూ అప్పలరాజు గారి మెస్ A/c
మీల్స్ & కర్రీ పాయింట్
ప్రత్యేకతలు
రాగి సంగటి నాటుకోడి పులుసు
రాగి సంగటి చేపల పులుసు
బిర్యానీలు, ఎగ్, చికెన్ స్పెషల్, నూడిల్స్ మంచూరియా, ఫ్రైడ్‌రైస్, వెజ్ కర్రీస్, మీల్స్
వివాహాది శుభకార్యములకు మీ ఆర్డరుపై సప్లయి చేయబడును
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మెయిన్ బ్రాంచ్ ప్రక్కన, భీమవరం -1, సెల్ : 9631945456

సీతయ్య పలావు సెంటర్
వరల్డ్ ఫుడ్ డే శుభాకాంక్షలతో..
వివాహాది శుభకార్యములకు మీ ఆర్డరుపై సప్లయి చేయబడును
సీతయ్య పలావు సెంటర్
పోలీసు బొమ్మ సెంటర్ - భీమవరం

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, జనరల్ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమవరం డివిజన్
90102 23729
79955 66351
90108 51166
Office mail : tpgadvt@gmail.com

ఉండి బస్టాండ్ రహదారులు అధ్వానం

- బస్టాండ్‌కు వెళ్లేందుకు భయపడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



ఉండి బస్టాండ్ నుంచి బయటకు వచ్చేందుకు నానాపాట్లు పడుతున్న ప్రయాణికులు



గోతులతో దర్శనమిస్తున్న ఉండి బస్టాండ్ లోపలిరోడ్డు

ఉండి: నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఉండి బస్టాండ్ పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతుంది.అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికుల పాట్లు వర్ణనాతీతంగా మారాయి. కొద్దిపాటి వర్షం కురిసినా చెరువులా మారిపోతున్న బస్టాండ్ ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు మరింత అధ్వానంగా మారింది. బస్టాండ్ లోపలికి వెళ్లాలన్నా, బస్సుదిగి బయటకు రావాలన్నా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. బస్టాండ్ లోపలికి, బయటకు వచ్చేందుకు అనువుగా నిర్మించిన రోడ్లు దారుణంగా పాడైపోవడంతో ప్రయాణికులు నడిచివెళ్లేందుకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తుంది.

ప్రధాన జంక్షన్

ఆకివీడు, కైకలూరు, గుడివాడ, ఏలూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు గణపవరం, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు ఉండి బస్టాండ్ ఓ జంక్షన్‌గా వుంది.అయితే ఓవైపు జాతీయ రహదారి మరోవైపు రాష్ట్రీయ రహదారి ఉన్న ఉండి బస్టాండ్ సుదూర ప్రాంతాలకు వెళ్లే ఉండి పరిసర ప్రాంతాల వారికి ఓ మంచి ప్రయాణస్థానంగా ఉంది. అయితే ఇంత ప్రత్యేకమైన స్థానం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో అత్యంత ప్రమాదరకంగా మారింది. కనీసం ప్రయాణికులు బస్టాండ్ లోపలికి వెళ్లాలన్నా, లోనికి రావాలన్నా అసాధ్యంగా మారింది. బస్టాండ్ రోడ్లు చెరువుల్లా మారిపోవడంతో బస్సులకు కూడా ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. బస్టాండ్ బురదయమంగా మారిపోవడంతో బస్సు ప్రయాణం చేసేందుకు కూడా ప్రయాణికులు ఆసక్తి చూపించడం లేదు.

మౌలిక సదుపాయాలు కరువు

బస్టాండ్ ముంపు అటుంచితే ప్రయాణికులకు కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేని స్థితిలో అధికారులు వుండటం ఉండడం గమనార్హం. బస్టాండ్ ఆవరణలో లైట్లు అస్సలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రయాణికులు లోపలికి వచ్చేందుకు, బస్సుదిగి బయటకు వెళ్లేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఉండి బస్టాండ్ సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రయాణికులంటే అలుసెందుకు?



బస్సుల్లో ప్రయాణించే పేద, మధ్య తరగతి వారంటే ప్రభుత్వానికి అంత అలుసెందుకు? ప్రయాణికులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా అధికారులు మౌనంగా ఉండటం దేనికి సంకేతం. బస్టాండ్ అవరణలో లైట్లు కూడా వేయలేని స్థితిలో అధికారులు ఉన్నారు. ఉండి బస్టాండ్‌పై ఎందుకింత నిర్లక్ష్యం?

– బదుగు బాలాజీ,ఉండి

రోడ్లు చూస్తుంటే భయమేస్తోంది



బస్టాండ్ లోపలికి వెళ్లాలన్నా, బస్టాండ్ నుంచి బయటకు రావాలన్నా చాలా భయంగా ఉంటుంది. రోడ్లు చెరువుల్లా మారిపోవడంతో ఎటు వెళ్లాలో? తెలియని పరిస్థితి నెలకొంది. ప్రయాణికులు ఇన్ని పాట్లు పడుతుంటే అధికారుల్లో ఎందుకు చలనం లేదు. దీనిపై వెంటనే అధికారులు స్పందించి బస్టాండ్ రోడ్లను మెరుగుపరచాలి.

– వర్రే పైడియ్య, పాములపర్రు

విజిలెన్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలి



బొబ్బిలి బంగారయ్య

ఆకివీడు: వినియోగదారుల వ్యవహారాలు, పౌర సరఫరాల శాఖలో వినియోగదారుల వ్యవహారాల విభాగాన్ని జిల్లా అధికారులు పూర్తిగా విస్మరిస్తున్నారని వినియోగదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ మండలి ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలు అయినప్పటికీ నేటికీ ఒక సమావేశం నిర్వహించలేదన్నారు. జిల్లాలో కల్తీ సామ్రాజ్యం ఏర్పడిందని, నకిలీ వస్తువులు పెరిగిపోతున్నాయని, సంక్షేమ పథకాల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో జీఎస్టీ ఎగవేస్తూ, బంగారం, నిత్యావసరాల బిల్లులు లేకుండా కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. కల్తీ, మోసాలు, దగా వ్యాపారాలు చేస్తున్నప్పటికీ పౌర సరఫరాలు, నిఘా అధికారులు పట్టించుకోవడం లేదని, మొక్కుబడి తనిఖీలు చేస్తున్నారని విమర్శించారు. మండల కేంద్రాల్లోనూ, మేజర్ పంచాయతీలు, నగర పంచాయతీలు, మునిసిపాలిటీలలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల జాడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు ప్రాంతాల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులున్నప్పటికీ ఖాళీగా ఉన్నాయని, ఇన్‌చార్జిల పేరుతో కాలం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కల్తీ, అక్రమ వ్యాపారాల్ని అరికట్టేందుకు వినియోగదారుల రక్షణమండలి విజిలెన్స్ సమావేశం ఏర్పాటు చేసేందుకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

అధిక ధరలను అరికట్టాలి

పెనుగొండ: రెండు నెలలుగా పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలు సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నాయని సీపీఎం పెనుగొండ గ్రామ కార్యదర్శి నాగిశెట్టి గంగారావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పెనుగొండ తహసీల్దారు జి.అనిత కుమారికి అధిక ధరలను అరికట్టాలంటూ వినతి పత్రం సమర్పించారు. మార్కెట్లో వంట నూనెలు, పప్పులు, కూరగాయలు, ఉల్లిపాయలు ధరలు భారంగా మారాయన్నారు. పేదలకు సబ్సిడీపై చౌక డిపోల ద్వారా మార్కెట్ రేట్లు కంటే తగ్గించి అందించాలన్నారు. చౌకడిపోల్లో బియ్యం మాత్రమే ఇస్తున్నారని, కందిపప్పు, చింతపండు, పంచదార వంటి వంట సామగ్రి ఊసే లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, కడలి చందు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న మద్యం దుకాణాలు



భీమవరంలో ప్రారంభానికి సిద్ధం చేస్తున్న మద్యం దుకాణం

భీమవరం: రాష్ట్రంలో ప్రభుత్వం కొత్త మద్యం విధానం అమలులోనికి తేవడంతో ప్రైవేటు వ్యాపారులు బుధవారం మద్యం షాపుల ప్రారంభానికి సిద్ధమవుతున్నారు. గత ప్రభుత్వం అంచెలంచెలుగా మద్య నిషేధంలో భాగంగా ప్రభుత్వమే మద్యం షాపులు ఏర్పాటు చేసి మద్యం దుకాణాలను ఘణనీయంగా తగ్గించడమేగాక మద్యం ధరలను కూడా పెంచింది. దీనితో మద్యం విక్రయాలు తగ్గాయి. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మళ్లీ పాత విధానానికి తెరలేపారు. దుకాణాల ఏర్పాటుకు లాటరీ విధానం ప్రవేశపెట్టి పెద్ద సంఖ్యలో షాపులు ఏర్పాటుకు అవకాశమిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 175 షాపులు ఏర్పాటు చేస్తుండగా ఈనెల 16వ తేది నుంచి ప్రైవేటు వ్యాపారులు తమ షాపులను ప్రారంభించనున్నారు. దీనికిగాను ఇప్పటికే విక్రయాలు అధికంగా ఉండే ప్రాంతాలను ఎంపిక చేసుకుని షాపులను ఏర్పాటు చేస్తున్నారు. విశాలమైన గదులతోపాటు కూర్చుని మద్యం సేవించడానికి అనుకూలంగా ఉండే విధంగా షెడ్లు నిర్మించుకోడానికి కూడా అనువైన ప్రాంతాలను ఎంపిక చేసుకుని షాపులను ఏర్పాటు చేస్తున్నారు.

మద్యం షాపులకు దేవుళ్ల పేర్లు......

మద్యం షాపుల ప్రారంభానికి, షాపులకు పేర్లు పెట్టడం కోసం వ్యాపారులు ముహూర్తాలకోసం పురోహితుల వద్దకు పరుగులు పెడుతున్నారు. షాపులు దక్కించుకున్న ఎక్కువ మంది వ్యాపారులు తమ షాపులకు దేవుళ్లు, దేవతల పేర్లు పెడుతుండడం విశేషం. బుధవారం చతుర్దశి కావడంతో మంచిరోజుగా భావించి ముహూర్తాలు పెట్టిస్తున్నారు. మద్యం షాపులను ఎక్కువగా కూటమి నాయకులు దక్కించుకోవడంతో కూటమి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగానే షాపులకు ప్రారంభోత్సవం చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: మండలంలోని యండగండి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే విద్యుత్ లైన్లపై ఉండే చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు యండగండి, ఉణుదుర్రు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా జాతీయ విద్యార్థి దినోత్సవం



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాలకోడేరు: భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ పెన్నాడ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా అక్టోబర్ 15న జాతీయ విద్యార్థి దినోత్సవం జరుపుకుంటారని, ఆయన ఆలోచనలను విద్యార్థులు అందిపుచ్చుకుని దేశానికి, వారి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాబట్టి సురేష్ అన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ కురెళ్ల భాస్కరరావు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఏబీఎస్ఆర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జీరో అకౌంట్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

ఆకివీడు: విద్యార్థులకు జీరో అకౌంట్‌తో బ్యాంక్ ఖాతా తెరిస్తే రూ.6 లక్షల ప్రమాద బీమా వర్తింపజేస్తున్నట్లు కెనరా బ్యాంక్ అధికారి అశోక్ కుమార్ చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలో వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రూ. 5 వేలు మినిమం బ్యాలెన్స్‌తో అకౌంట్ ఓపెన్ చేసుకుంటే బ్యాంకుతో అనుబంధం ఉన్న కోర్సా సంస్థతో రెండు సర్టిఫికెట్ కోర్సులు ఉచితంగా అందజేస్తామని అశోక్ కుమార్ చెప్పారు. జీరో అకౌంట్ తెరిచిన విద్యార్థులకు 28 ఏళ్లు వయస్సు వచ్చే వరకూ బ్యాంక్ లావాదేవీల్లో ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ కె.ఆనందకుమార్, అధ్యాపకులు ఓగేశ్వరరావు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.


వసతి గృహంలో తనిఖీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి అప్పలస్వామి

భీమవరం: వసతి గృహాల్లో సౌకర్యాలపై భీమవరం సివిల్ జడ్జి బి.అప్పలస్వామి మంగళవారం తనిఖీలు చేశారు. పట్టణంలోని వెంకటేశ్వర బధిరుల పాఠశాల, కాళ్ల మండలం అరుణక్షదయ మనోవికాస కేంద్రం, పోలీస్ బొమ్మ సెంటర్‌లోని బీసీ ప్రభుత్వ బాలుర హాస్టల్, బుధవారం మార్కెట్ వద్ద గల బీసీ ప్రభుత్వ బాలుర వసతి గృహాలను ఆయన సందర్శించారు. అలాగే భీమవరం 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ డి ధనరాజు ఆకివీడులోని జెడ్పీ హైస్కూల్ వద్ద గల బీసీ ప్రభుత్వ బాలిక హాస్టల్, ఆర్యకల్యాణ మండపం వద్ద గల ఎస్సీ ప్రభుత్వ బాలుర హాస్టల్, ఉండి పోలీసు స్టేషన్ దగ్గరగల బీసీ ప్రభుత్వ బాలుర హాస్టల్, ఉండి పెదపేటలోని ఎస్సీ ప్రభుత్వ బాలికల వసతి గృహాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు పి అంబేడ్కర్, కె జ్యోతి, ఎంబీ భవాని, బి సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బీవీ రాజు జయంతి



బీవీ రాజు కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

భీమవరం: పట్టణంలోని శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, బీవీరాజు ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ బీవీరాజు 104వ జయంతిని పురస్కరించుకొని బుధవారం భీమవరం పట్టణం, పరిసర ప్రాంతాలలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ఆవరణలోని బీవీ రాజు సమాధి వద్ద శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, ఫౌండేషన్‌కు చెందిన వివిధ కళాశాలల డైరెక్టర్స్, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన 18 మంది విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్‌లను నగదు రూపంలో అందజేశారు. అనంతరం కుముదువల్లి గ్రామంలో పేదలకు పండ్లు, బిస్కట్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విష్ణు క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 106 మంది విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు.

రజకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



పాలకోడేరులో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మడక రాజు

పాలకోడేరు: ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం పాలకోడేరు మండల కమిటీ సమావేశాన్ని మంగళవారం మోగల్లు గ్రామంలో సంఘ భవనంలో సంఘ అధ్యక్షుడు కొమరపూరి అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి మడక రాజు హాజరై మాట్లాడుతూ జిల్లాలో చెరువులపై గ్రామ పెద్దలు పెత్తందారీతనం చేస్తున్నారని, దానికి ప్రభుత్వ అధికారులు కూడా వారికి వత్తాసు పలుకుతున్నారని వాపోయారు. రజక వృత్తిదారులు సంఘం చూస్తూ ఊరుకోదని, జీఓ నంబర్ 343 ప్రకారం ప్రతి గ్రామానికీ ఒక వృత్తి చెరువు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో మహిళలపై అనేక ప్రాంతాలలో దాడులు చేస్తున్నారని, అత్యాచారాలకి ప్రయత్నిస్తున్నారని, అట్రాసిటీ చట్టం మాదిరిగానే రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కమిటీ సభ్యుడు యండమూరి నాగేంద్ర మాట్లాడుతూ వృత్తిదారులు బిడ్డల చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు రాక వృత్తిలోనే మగ్గిపోతున్నారని ప్రభుత్వం వెంటనే రజకులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. 50 ఏళ్లు నిండిని వారికి రూ. 5 వేలు పెన్షన్ ఇచ్చి వృత్తిదారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల అమ్మారావు, ఉపాధ్యక్షుడు మల్లిపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరేడు, కలిగొట్లలో గ్రామ సభలు



ఆరేడు గ్రామ సభలో మాట్లాడుతున్న ఓమేగారాజు

ఉండి: జాతీయ ఉపాధి హామీ పనుల గుర్తింపు, అంచనాల తయారీ కోసం రెండవ దఫా నిర్వహిస్తున్న గ్రామ సభల్లో భాగంగా మంగళవారం మండలంలోని ఆరేడు, కలిగొట్ల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆరేడులో రూ.16 లక్షల విలువైన 21 పనులు గుర్తించారు. అలాగే కలిగొట్లలో రూ.18 లక్షల విలువైన 26 పనులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీనిలో భాగంగా ఆరేడులో సర్పంచ్ కట్రెడ్డి బ్రహ్మానందం అధ్యక్షతన గ్రామ సభలో టెక్నికల్ అసిస్టెంట్ లంకపల్లి ఓమేగారాజు మాట్లాడుతూ రెండో దఫా నిర్వహించే ఈ గ్రామ సభల ద్వారా గ్రామాల్లో గుర్తించిన ఉపాధి హామీ పనులకు అంచనాలు తయారు చేసినట్లు తెలిపారు. అలాగే కూలీలకు ఉపాధి కల్పించడం ద్వారా వచ్చే మెటీరియల్ కాంపొండెంట్ ద్వారి సుస్థిరాస్తులు సాధిస్తామన్నారు. అలాగే రైతులకు ఉపయోగపడే పంట, మురుగు బోదెలను శుభ్రం చేయడం, హార్టీకల్చర్‌లో పండ్ల తోటలు, పశువులు, గొర్రెల పెంపకానికి షెడ్లు నిర్మాణం చేపట్టడం వంటి కార్యక్రమాలు ఉపాధి హామీ పథకం ద్వారా చేపడతామన్నారు. గ్రామసభలో ఆమోదించిన పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపడతామని స్పష్టం చేశారు.

వసతుల కల్పనకు ప్రాధాన్యం



కొమరాడ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే రామాంజనేయులు

భీమవరం: గ్రామాలలో ఎక్కువ మొత్తం ఉపాధి హామీ పనులు చేపట్టి తద్వారా గ్రామాల అభివృద్ధి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం భీమవరం మండలం కొమరాడ గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులు రూ.80లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణాలకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయుల భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులను పెద్ద ఎత్తున కేటాయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక ఇబ్బంది పడే కుటుంబాలకు వంద రోజులు పని దినాలు కల్పించాలనే లక్ష్యంతో పథకాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కే సిహెచ్ అప్పారావు, హౌసింగ్ ఈఈ బి.వెంకటరమణ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి కె.శ్రీనివాసరావు, కొమరాడ సర్పంచ్ రాట్నాల వీరయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు రాట్నాల సత్యనారాయణ స్వామి, మాణిక్యాలరావు, వివిధ మండల స్థాయి అధికారులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కాళ్లకూరులో లఘు కల్యాణం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న స్వయం భూః శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో బుధవారం రాత్రి 07:30కు వార్షిక ఆశ్వయుజ మాస లఘు కల్యాణం (చిన్న కల్యాణం) జరుగుతుందని దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులందరూ విచ్చేసి స్వామివారి కల్యాణ మహోత్సవాలను తిలకించాలని కోరారు.

ఆదరణ కూడిక
భార్య :
దొండపాటి మేరి మెటిల్డ
దొండపాటి పద్మరావు
జననం : 15-08-1940, మహిమప్రవేశం : 06-10-2024
కుమారులు : దొండపాటి ఆరోను సురేష్ కుమార్
దొండపాటి రాజకుమార్
దొండపాటి రవిచంద్రన్
ఆదరణకూడిక : 16-10-2024 బుధవారం